క్లుప్తంగా

గండేపల్లిలో శానిటేషన్ పనులు



కంచికచర్ల: మండలంలోని గండేపల్లిలో ఆదివారం పంచాయతీ అధికారులు శానిటేషన్ పనులు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నట్లు చెప్పారు. మురుగునీరు పారుదల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని వీధుల్లో శానిటేషన్ అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు బ్లీచింగ్ సున్నం చల్లించామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా డ్రైయినేజీల్లో ఎబేట్‌ను పిచకారీ చేయించినట్లు తెలిపారు. వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జె.రత్నాకర్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి : సీఐ

నందిగామటౌన్: రౌడీషీటర్లుత సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీఐ వైవిఎల్ నాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరచరిత్ర కలిగినవారు తమ తీరు మార్చుకుని నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఘర్షణలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా నేర స్వభావాన్ని మార్చుకుని కుటుంబసభ్యులతో సంతోషంగా జీవనం సాగించాలని సూచించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ శిక్షణకు ఎంపిక



కొమరగిరి రమ్య

జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన కొమరగిరి రమ్య ఎన్ఐఎస్ఎన్ఐఎస్ జాతీయ బ్యాడ్మింటన్ శిక్షణ(సర్టిఫికెట్ కోర్సు)కు ఎంపికైంది. పాటియాలాలోని క్రీడాప్రాధికార సంస్థ(ఎస్ఏఐ) ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కోర్సుకు హాజరుకానుంది. ఈ శిక్షణను పూర్తిచేయడం ద్వారా రమ్య, ఎన్టీఆర్ జిల్లాలో ఈ కోర్సు ద్వారా ఎంపికైన తొలి మహిళా బ్యాడ్మింటన్ కోచ్‌గా మారనుంది. జాతీయస్థాయి శిక్షణకు ఎంపికైన రమ్య క్రీడా ప్రయాణం క్రీడాకారులందరికీ స్ఫూర్తిదాయకమని స్థానిక కేవీకే ఇండోర్ స్టేడియంలో ఆమెకు శిక్షణ ఇస్తున్న శాప్ బ్యాడ్మింటన్ కోచ్ కె.గోపి పేర్కొన్నారు.

బోరుకు మరమ్మతులు చేపట్టరూ...



నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామ ప్రధానసెంటర్‌లోని బోరు మర్మమతులకు గురై నిరుపయోగంగా మారింది. విద్యుత్ కోతల సమయంలో ఈ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని, ప్రస్తుతం బోరు పనిచేయకపోవడంతో ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబు మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెక్యూరిటీ గార్డ్స్‌తో సహా 50 లక్షల మంది కార్మికులు పనిచేసే షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు సవరించలేదన్నారు. వేతనాల కోడ్ పేరిట జాతీయ కనీస వేతనం పేరుతో కార్మికుల వేతనాలపై దాడి జరుగుతుందని చెప్పారు. ఈ నెల 10లోగా సదస్సులు, 17, 18 తేదీల్లో మోటార్ సైకిల్ జాతాలు నిర్వహించాలని, 20న సమ్మె సందర్భంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు



శ్రీతిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. భక్తుల రాకపోకల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పెనుగంచిప్రోలులో వాహనాల రద్దీ కొనసాగింది.



అమ్మవారి రథోత్సవం



ఆలయ ప్రాంగణంలో భక్త జనసందోహం



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

విద్యార్థులకు ఆటల్లో శిక్షణ



కొణకంచిలో చెస్ ఆడుతున్న విద్యార్థులు



జగ్గయ్యపేటలో పేపర్ క్రాఫ్ట్ ఫ్లవర్స్‌తో విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించారు. టీడీసీ నాగమల్లిక విద్యార్థులతో పేపర్ క్రాఫ్ట్‌లో ఫ్లవర్స్ తయారు చేయడం నేర్పించారు. గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

కొణకంచి(పెనుగంచిప్రోలు): వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులచే పుస్తకపఠనం చేయించడంతోపాటు ఆటల్లో శిక్షణనిచ్చారు. విద్యార్థులు క్యారమ్స్, చెస్‌ఆటలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి రామచంద్రుడు సూచించారు. యర్రం భాస్కరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు

13న లూర్ధుమాత ఆలయ ప్రతిష్ఠ

వీరులపాడు: మండలంలోని బోడవాడ–జమ్మవరం గ్రామంలోని పరిశుద్ధ లూర్ధుమాత విచారణ నూతన దేవాలయం ప్రతిష్టా మహోత్సవాలను ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఫాదర్ లూర్ధురాజు ఆదివారం తెలిపారు. విచారణ పరిధిలోని వీఅన్నవరం, వీరులపాడు, వెల్లంకి, గోకరాజుపల్లి గ్రామాలలోని దాతలు, సంఘ విశ్వాసుల సహకారంతో సుమారు రూ.1.60 కోట్లతో నూతనంగా పరిశుద్ధ లూర్ధుమాత ఆలయ పునర్నిర్మాణం చేసినట్లు తెలిపారు.ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా 10వ తేదీ సాయంత్రం జెండా ప్రతిష్ఠ, దివ్య బలిపూజ, 11న బోడవాడ–జమ్మవరం గ్రామాలలో పరిశుద్ధ లూర్ధుమాత స్వరూపంతో గ్రామోత్సవం, దివ్యబలిపూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 13న విజయవాడ మేత్రాసన పీఠాధిపతి ఫాదర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు చేతుల మీదుగా నూతన ఆలయ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని తెలిపారు. రాత్రికి ఆంధ్ర క్రైస్తవ నాట్యమండలి ఆధ్వర్యంలో లాజర్ ధనవంతుడు బైబిల్ నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్టా మహోత్సవాలను విజయవంతం చేయాలని లూర్ధురాజు కోరారు.



బోడవాడ-జమ్మవరంలో పునర్నిర్మించిన పరిశుద్ధ లూర్ధుమాత ఆలయం

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ రూరల్: మండలంలోని అనాసాగరం–మాగల్లు 33కేవీ టవర్ లైన్ మరమ్మతు పనుల దృష్ట్యా సోమ, మంగళవారాల్లో ఆయా గ్రామాల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పూర్ణచంద్రరావు ఆదివారం తెలిపారు. మండలంలోని తొర్రగుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లగిరి, రాఘవాపురం, రుద్రవరం, సోమవరం, గోళ్లమూడి, కొండూరు, రామిరెడ్డిపల్లి, తొర్రగుడిపాడు, జొన్నలగడ్డ, మాగల్లు, దాములూరు, కొణతమాత్మకూరు గ్రామాల్లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు రెండురోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. ఆయా గ్రామాల రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. బెంగళూరుకు చెందిన మునిపల్లి మహతి పర్యవేక్షణలో సుమారు 19 మంది విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను పలువురు భక్తులు అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఏడాదిగా సేవలకు తాళం

- కూటమి ప్రభుత్వంలో బోసిపోయిన సచివాలయాలు
- రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు నిలిపివేత
- పునఃప్రారంభించని కూటమి ప్రభుత్వం
- కొత్తకార్డుల కోసం జనం ఎదురుచూపులు

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయకపోతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా పాలన సాగిస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నేతలు, తీరా అధికారంలోకి వచ్చాక నేటివరకు ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేకపోవడంపై జనం పెదవి విరుస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనహయాంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలెవ్వరూ వార్డు, గ్రామ పొలిమేర దాటాల్సిన పనిలేకుండా రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేశారు. దీంతో నాడు ఆయా పౌరసేవల కోసం తరలివచ్చే జనంతో కళకళలాడిన సచివాలయాలు నేడు కూటమి ప్రభుత్వంలో కళ తప్పి వెలవెలబోతుండటం గమనార్హం.

ఇంకెన్నాళ్లు ఈ ఎదురుచూపులు..

గ్రామాల్లో కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం ప్రజలు ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. నూతనంగా పెళ్లయిన జంటలు, ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుపడినవారు నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. మూసివేసిన వెబ్‌సైట్‌ను కూటమి ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఇక చిన్నారుల పేర్లను రేషన్‌కార్డుల్లో నమోదు చేయించుకునేందుకు మరికొన్ని కుటుంబాలవారు ఎదురుచూస్తున్నారు. ఇక ఆరోగ్య శ్రీ కార్డుల కోసం పేదలు ఎదురుచూస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటూ లక్షలాది రూపాయల వైద్యాన్ని కూడా ఉచితంగా పొందే అవకాశం ఉండటంతో పేదలు ఆరోగ్యశ్రీ కార్డు కోసం సచివాలయాలకు వెళ్తే వెబ్‌సైట్ పునఃప్రారంభం కాలేదనే మాట వినిపిస్తుండటంతో తీవ్రనిరాశకు గురవుతున్నారు.



కంచికచర్ల మండలం కొత్తపేట గ్రామ సచివాలయం

అప్పుడలా...ఇప్పుడిలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పల్లెలోనే ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో సమారు రూ. 40లక్షలు వెచ్చించి అన్ని హంగులతో సచివాలయ భవనాలు నిర్మించారు. కంచికచర్ల మండలంలో 16 గ్రామ పంచాయతీలకు గానూ 17 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి 50ఇళ్లకు ఓ వలంటీర్ చొప్పున నియమించడంతోపాటు ఆయా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దనే అందించారు. కాని నేటి కూటమి ప్రభుత్వంలో గ్రామసచివాలయ వ్యవస్థ పింఛన్ల పంపిణీకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నారు. ఆయా పథకాలన్నీ నిలుపుదల చేయడంతో సచివాలయం గడప తొక్కేవారే లేక ఆయా సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాలు వెలవెల...



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలు ప్రజలకు విస్తృత సేవలు అందించాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో పథకాలన్నీ నిలిచిపోవడంతో సచివాలయాలన్నీ వెలవెలబోతున్నాయి. కొత్త రేషన్‌కారుడలు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వకపోతుండటంతోపాటు ఎన్నికల్లో చెప్పిన హామీలను కూటమి ప్రభుత్వం ఏడాదిగా అమలు చేయకపోతుండటమే ఇందుకు కారణం.

– మార్త శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు, పరిటాల

కొత్తకార్డులు మంజూరు చేయాలి



సచివాలయాల ద్వారా రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గతంలో ఉన్న వెబ్‌సైట్లు ప్రస్తుతం పనిచేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 12నెలలు కావస్తున్నా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. ఇకనైనా ఆయా వెబ్‌సైట్లను పునఃప్రారంభించి పేదలకు నూతన రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలి.

– మురుమూరు పాండురంగారావు, కంచికచర్ల

అకాల వర్షంతో తడిసిన వరిధాన్యం



శౌరి అమరవరంలో తడిసిన వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మానస, ఏఓ

కంచికచర్ల : మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి కల్లాల్లోని వరిధాన్యం తడిసి పోయింది. ప్రభుత్వం సకాలంలో రైతులకు గోనెసంచులు సరఫరా చేయకపోవడంతో వరిధాన్యాన్ని కళ్లాలో పట్టాలపై ఆరబోరగా, ఈ వర్షం దెబ్బకు ధాన్యం తడిసి పోయింది. కూటమి ప్రభుత్వం కేవలం కొద్దిమంది రైతులకు మాత్రమే గోనెసంచులను అందజేయడంతో వారు మాత్రమే ధాన్యాన్ని మిల్లులకు తరలించగలిగారు. గోనెసంచులు అందుబాటులో లేకపోవడంతో తాము ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోయామని ధాన్యం తడిసి పోయిన బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల పట్టాలు కప్పినా గాలితో కూడిన వర్షం కురవడంతో ధాన్యం తడిచిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన చేతికొచ్చిన వరి ధాన్యం తడిచిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు.

తడిసిన ధాన్యం పరిశీలన..

మండలంలోని శౌరి అమరవరం, వేముపల్లి గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ వీ మానస, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ పరిశీలించారు. కొన్ని చోట్ల వరి ధాన్యం తడిచిపోవడంతో వాటిని ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ మానస మాట్లాడుతూ త్వరలోనే రైతులకు గోనెసంచులను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు రైతులకు 2,500 గోనెసంచులను అందించామని, మరో 2వేల వరకు గోనె సంచులు త్వరలోనే అందజేస్తామని వివరించారు. వారి వెంట వీఆర్వో కె.బ్రహ్మం ఉన్నారు.

నందిగామలో ఓ మోస్తరు వర్షం...

నందిగామ రూరల్: నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కారణంగా కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. పట్టాలు కప్పి చేతికొచ్చిన పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయానికి కురుస్తున్న వర్షాలతో పంటలు నష్టపోవాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

సందడిగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



ఐతవరంలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నందిగామరూరల్: మండలంలోని ఐతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సందడిగా సాగింది. స్థానికంగా ఉంటున్న పూర్వవిద్యార్థులతోపాటు రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల ఆవరణ, తరగతి గదులను కలియతిరిగారు. చదువుకున్నప్పటికీ సంగతులను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించి, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన నాటి ఉపాధ్యాయులకు దుశ్శాలువలు, మొమెంటోలతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నవీన్, రవికిరణ్, ధనలక్ష్మి, మద్దుకూరి శిరీష, మాధవి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: పట్టణంలోని కెవీఆర్ కళాశాల 1998–2001 విద్యా సంవత్సరం బీఎస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక రామకృష్ణా ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ పూర్తి చేసి 25 ఏళ్లెన సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకుని ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. తమ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, కోటేశ్వరరావు, శివనప్రసాద్, స్వామి, రజనీకాంత్, నరసింహారావు, షర్మిళ, వాసుదేవరావు, సాంబశివరావు, సంగయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నందిగామ కేవీఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు

క్రికెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. పట్టణంలోని జీవీజె జెడ్పీ బాలుర హైస్కూల్‌లో జగ్గయ్యపేట బీవీ సాగర్ మెమోరియల్ ట్రస్ట్, కృష్ణా డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును ఎమ్మెల్యే తాతయ్య ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 31 వ తేదీ వరకు నిర్వహించనున్న క్రికెట్ క్యాంపులో తగిన శిక్షణ పొందాలన్నారు. క్రీడాకారులకు మీసాల మనోజ్‌కుమార్ సహకారంతో క్రికెట్ బ్యాట్లు, గ్లౌవ్స్ తదితర క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కోచ్ రాజేంద్ర, కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు, సీనియర్ క్రికెటర్లు నోముల రఘు, బీవీ.సుధీర్, మనోజ్‌కుమార్, పితాని శ్రీనాథ్ పాల్గొన్నారు.

225 మందికి కంటి పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవాసమితి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు 225మందికి కంటి పరీక్షలు చేసి, 105 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిలో మొదటి విడతగా 45 మందిని ఆపరేషన్ నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లినట్లు శ్రీసత్యసాయి సేవాసమితి కన్వీనర్ చిట్టూరి కొండ తెలిపారు. మిగిలిన వారిని మంగళవారం ఆపరేషన్‌కు తీసుకువెళ్తామని వివరించారు. కార్యక్రమంలో సేవాదళ్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బిఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తే, వాటిని పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

•బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన బ్లాక్ నంబర్ 109లో నివాసం ఉండే బుజ్జి, తిరుపతిరావు దంపతుల కుమార్తె(13) శుక్రవారం రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేదు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.